క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: హనుమకొండ టౌన్ పరిధిలోని బస్తీనగర్, గోపాల్‌పూర్, రంగంపేట పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని లోటస్ కాలనీ, ముత్యాలవనం కాలనీ, విల్లాస్, ప్రకాశ్ రెడ్డి పేట, జూలైవాడ, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్, ఎస్సీకాలనీ, కాంత్యానగర్, పోచమ్మగుడి, వివేక్‌నగర్, శివసాయి కాలనీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పోతన సబ్‌స్టేషన్ పరిధిలోని భద్రకాళి టెంపుల్, బల్దియా కార్యాలయం, రంగంపేట, ఎంజీఎం క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 10 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

హసన్‌పర్తి: 66వ డివిజన్ హసన్‌పర్తిలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ అశోక్ తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం ఉన్నందునా వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వేంకటేశ్వరుడి కల్యాణం



నయీంనగర్: పరశురాం దళ్ ఆధ్వర్యంలో అలివేలుమంగ, ఆదిలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం, అయ్యప్పస్వామి మహా పడి పూజను హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్నట్లు పరశురాం దళ్ అధ్యక్షుడు ఎం.వెంకట రమణాచార్యులు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పూజారి మణికంఠ శర్మ, పరశురాం దళ్ సభ్యులు శ్రీవర్ధన్, మేఘశ్యామ్, శ్రీమన్నారాయణ, శశికుమార్, సాత్విక్, సూరజ్‌సింగ్, నాగేందర్ పాల్గొన్నారు.

మహంకాళికి గాజుల అలంకరణ



మడికొండ: మార్గశిర శుద్ధ పంచమి సందర్భంగా 46వ డివిజన్ మడికొండలోని మహంకాళి అమ్మవారికి పంచ సహస్ర గాజుల అలంకరణను అర్చకుడు మంత్రవాది వెంకటప్రసాద్ మంత్రోచ్చరణల మధ్య శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, సరిత, సంధ్య, శారద, దివాకర్రెడ్డి, ప్రసూన, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో సృజనాత్మకత పెంపు

హన్మకొండ అర్బన్: దివ్యాంగులను క్రీడల్లో ప్రోత్సహించడం ద్వారా వారిలో మానసిక ఉల్లాసం, సృజనాత్మకత పెంపొందుతాయని స్పెషల్ ఒలింపిక్ భారత్ తెలంగాణ ప్రాంత సభ్యుడు సి.రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని దివ్యాంగులు, విలియం కేరీ బాప్టిస్ట్ హైస్కూల్ చిన్నారులకు విలియం కేరీ పాఠశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన క్రీడలను ఆయన ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విలియం కేరీ బాప్టిస్ట్ స్కూల్ ఇన్‌చార్జ్ కె.విద్యాసాగర్, ప్రిన్సిపాల్ టీఎం ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.దేవయ్య, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మ, కోడం కల్యాణ్ పాల్గొన్నారు.

పింఛన్ల మంజూరులో జాప్యం తగదు

కాజీపేట: నూతన పింఛన్ల మంజూరులో ప్రభుత్వం జాప్యం చేయడం తగదని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొని సాంబయ్య గౌడ్ అన్నారు. కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం జరిగిన సంఘం డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, చేతివృత్తుల వారు ఏళ్ల తరబడి పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నూతన పింఛన్లు మంజూరు చేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మోడెం రాజేందర్, మోడెం సురేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వరంగల్ పిన్నవారి వీధిలోని శారద ఉన్నత పాఠశాలలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా పరిషత్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, అతిథిగా ఆర్యవైశ్య సంఘం ప్రముఖుడు గట్టు మహేష్‌బాబు పాల్గొని విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యులు రామిరెడ్డి కృష్ణమూర్తి, ప్రముఖ ఆధ్యాత్మిక వక్త వంగల సోమయాజులు, తెన్నేటి వసుంధర, మురళీ మనోహర్, వేణుగోపాలస్వామి, వనభూమిలక్ష్మి, విజయ్‌య, పాఠశాల కరస్పాండెంట్ గుమ్మడవెల్లి సురేష్‌బాబు పాల్గొన్నారు.

డిసెంబర్ కోటా డిలే!

- చౌకధరల దుకాణాలకు చేరని బియ్యం
- నిల్వలు లేవని చేతులెత్తేసిన గోదాం ఇన్‌చార్జ్‌లు
- స్టేజ్–1 కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే సమస్య
- షాపుల వద్ద కార్డుదారుల పడిగాపులు
- పంపిణీకి మిగిలిన గడువు ఇంకా తొమ్మిది రోజులే..
- వరంగల్ కలెక్టర్ చొరవ తీసుకోవాలని రేషన్ డీలర్ల విజ్ఞప్తి



బియ్యం కోసం రేషన్ షాపు వద్దకు వచ్చిన లబ్ధిదారులు

ఖిలా వరంగల్: ఆహారభద్రత కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన డిసెంబర్ నెల కోటా బియ్యం చౌకధరల దుకాణాలకు ఇంకా చేరుకోలేదు. గోదాముల్లో బియ్యం నిల్వలు లేక పంపిణీ ఆలస్యం అవుతోంది. రేషన్ డీలర్లు స్టాక్‌పాయింట్ గోదాముల వద్దకు చేరుకుని బియ్యం రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వరంగల్ జిల్లాలోని వరంగల్ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి మూడు మండలాలు, వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి నాలుగు మండలాలు, నర్సంపేట ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఆరు మండలాలకు చెందిన చౌకధరల దుకాణాలకు బియ్యం చేరుతాయి. ఈ పాయింట్లలో ఎక్కడ కూడా బియ్యం నిల్వలు లేవు. దీంతో జిల్లాలో దొడ్డు బియ్యం కొరత ఏర్పడింది. అధికారులు దీనిపై సకాలంలో స్పందించి ఆర్వోలు జారీ చేశారు. ఈనెల ఒకటి నుంచి జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని గోదాముల నుంచి వరంగల్ జిల్లాకు రవాణా చేయాలని స్టేజీ-1 కాంట్రాక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. కాంట్రాక్టర్ లారీలు సమకూర్చకపోవడంతో గోదాములకు బియ్యం లోడ్‌లు రావడం లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనెల ఆరు రోజులు గడిచినా కనీసం 45 శాతం షాపులకు కూడా బియ్యం పంపించలేక ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు చేతులెత్తేసినట్లు తెలిసింది.

జిల్లాలో 507 చౌకధరల దుకాణాలు

వరంగల్ జిల్లాలో మొత్తం 507 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. 2,66,662 ఆహార భద్రత కార్డులకు 4,724,934 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రతి నెల పంపిణీ చేయాల్సి ఉంటుంది. వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల ద్వారా ఒక్కో చౌక దుకాణానికి కేటాయించిన నెల కోటా బియ్యం లారీల్లో సరఫరా చేస్తారు. ఒక్క వరంగల్ ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలోనే వరంగల్ మండలంలో 85, ఖిలావరంగల్ మండలంలో 72, గీసుకొండ మండలంలో 35 దుకాణాలు ఉన్నాయి. దొడ్డు బియ్యం కొరత కారణంగా శుక్రవారం వరకు మూడు మండలాల పరిధిలోని 50 శాతం దుకాణాలకు బియ్యం చేరుకోకపోవడం గమనార్హం. పంపిణీకి ఇంకా 9 రోజుల గడువు మాత్రమే ఉండడం, రేషన్‌షాపులకు బియ్యం చేరకపోవడంతో డీలర్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. దీంతో డీలర్లు గోదాం ఇన్‌చార్జ్‌లపై ఒత్తిడి పెంచుతున్నారు.

అసలు సమస్య ఇక్కడే..

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇతర జిల్లాల నుంచి లారీల్లో బియ్యం సకాలంలో ఎంఎల్ఎస్ పాయింట్స్‌కు చేరుకోలేకపోతున్నాయి. కాంట్రాక్టర్ లారీలు లోడుకు పెట్టకపోవడంతోనే ఈ సమస్య ఎదురవుతోందని డీలర్లు చెబుతున్నారు. ఆరు రోజులుగా ఎంఎల్ఎస్ పాయింట్లకు ఒకటి రెండు లారీలు పంపిస్తే రెండు, మూడు షాపులకు మాత్రం బియ్యం సరిపోతున్నాయి. డీలర్లకు ఏం సమాధానం చెప్పాలో తెలియక గోదాం ఇన్‌చార్జ్‌లు తలలు పట్టుకుంటున్నారు. కలెక్టర్, డీఎస్ఓ, డీఎం స్పందించి స్టేజ్-1 కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రేషన్ షాపులకు బియ్యం పంపిణీ చేయాలని పలువురు డీలర్లు కోరుతున్నారు.

10 వరకు బియ్యం సరఫరా చేస్తాం..

గోదాముల్లో దొడ్డు బియ్యం నిల్వలు లేక ఇతర జిల్లాల నుంచి తెప్పించి చౌక ధరల దుకాణాలకు పంపిస్తున్నాం. స్టేజ్-1 కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతాం. డీలర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈనెల 10వ తేదీ వరకు అన్ని దుకాణాలకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– సంధ్యారాణి, సివిల్ సప్లయీస్ డీఎం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- వంట సరుకుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు
- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద



ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఖిలా వరంగల్: విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్నం భోజనం అందించాలని, నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఇతర వంట సరుకుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద హెచ్చరించారు. ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మహిళలు తయారు చేస్తున్న మధ్యాహ్నం భోజనం, బియ్యం నిల్వలను అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్‌తో కలిసి ఆమె స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

మహిళలు విద్యపై దృష్టి సారించాలి



సదస్సులో మాట్లాడుతున్న సురేష్

- చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సెలర్ సురేష్

వరంగల్ లీగల్: మహిళలు తమ నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు విద్యపై దృష్టి సారించాలని చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సెలర్ ఆర్.సురేష్ సూచించారు. జిల్లా ప్రాంగణంలో న్యాయసేవా సదన్ భవనంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి మహిళా సహాయ కమిటీలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబీకుల శ్రేయస్సు కోసం బాధ్యతలు, పనులతో నిత్యం కష్టపడే మహిళలు తప్పనిసరిగా వ్యక్తిగత, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ కమిటీ ద్వారా మహిళలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సమాజంలో, కుటుంబంలో, పనిచేసే చోట జరుగుతున్న హింసను కొంతమంది మహిళలు మౌనంగా భరిస్తున్నారని, అలాంటి వారికి తామంతా అండగా నిలవాలని అన్నారు. ఎలాంటి న్యాయ సహాయానికైనా న్యాయసేవాధికార సంస్థలను సంప్రదించి ఉచిత న్యాయ సహకారం పొందాలని అన్నారు. సర్వోదయ సంస్థ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ సర్వోదయ సంస్థ స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ సహకారంతో హనుమకొండ జిల్లాలో సఖి కేంద్రం నిర్వహిస్తూ బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గీసుకొండ మహిళా సహాయత కమిటీ సభ్యులు, సర్వోదయ సంస్థ ప్రతినిధులు కవిరాజ్, ఇందిర, రవీందర్, అక్తర్, వనిత, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: త్వరలోనే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, డిజిటల్ రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం సన్నద్ధమవుతోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఒకటో డివిజన్ ముచ్చర్లలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. విలీన గ్రామాల అభివృద్ధికి అధిక నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ అరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్, డివిజన్ అధ్యక్షుడు నరేష్, గద్దం శివరాంప్రసాద్, కుడా మాజీ డైరెక్టర్ రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే, హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి భూమి పూజ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 60వ డివిజన్ వడ్డెపల్లిలో సుమారు రూ.6.43 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, అంతర్గత రోడ్లు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణాల కోసం చేపట్టనున్న పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సిద్ధం కావాలి

న్యూశాయంపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోరుకు సిద్ధంగా ఉండాలని నాయకులు, కార్యకర్తలకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా సహాయక కార్యదర్శుల సంయుక్త సమావేశం శుక్రవారం జరిగింది. హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇంకా అనేక హామీలను అమలు చేయాల్సి ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలని చూస్తున్నారని ఆరోపించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల అమరులైన పార్టీ నాయకుల సంస్మరణ సభలో నాయకులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయసారథి, రాజారెడ్డి, రవి, మల్లికార్జున్‌రావు, పి.రమేష్, అజయ్, శ్రీనివాస్, ఎల్లేశ్, ప్రసాద్, బాషుమియా, సుగుణ, సమ్మిరెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



వరంగల్: ఓసిటీ వరంగల్ క్రీడా మైదానంలో ఇటీవల ఎస్‌జీఎఫ్ఐ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ ఆరెపల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకన్న తెలిపారు. 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్ -17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ ఆరెపల్లికి చెందిన శశాంత్, గుడియా, యస్మిన్‌బాను ఎంపికయ్యారని వివరించారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో వారిని శుక్రవారం అభినందించినట్లు తెలిపారు. పీడీ పూజారి అశోక్‌బాబు, 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి అనిల్, సరోజన పాల్గొన్నారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

రామన్నపేట: ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7న నిర్వహించనున్న బంద్‌ను ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఎంజీఎం ఎదురుగా తెలంగాణ రాష్ట్ర ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నాయకులతో కలిసి బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తంచేశారు. ఆటో రవాణారంగ కార్మికుల సంక్షేమ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.అక్బర్, గుండె బద్రి, మహబూబ్ పాషా, అంజాద్, లతీఫ్, వడ్డాల రంజిత్, రత్నాకర్, అశోక్, మనోహర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆటోల బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: ఆటోల బంద్ వాల్‌పోస్టర్లను హనుమకొండ అంబేడ్కర్ సెంటర్‌లో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోల బంద్‌కు ఆటో కార్మికులు మద్దతు తెలపాలని కోరారు. మడికొండ బాబు, కలకోట్ల జయరాం, మామిడాల వెంకటేశ్వర్లు, గుండా రమేష్, చంద్రు, ప్రభాకర్, రవీందర్, చీకటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి శారదాపీఠంలో శిలాన్యాస పూజ



రామన్నపేట: శిలాన్యాస పూజ చేస్తున్న అర్చకులు

రామన్నపేట: ఆటోనగర్ రోడ్డులోని కంటి ఆస్పత్రి సమీపంలో ఉన్న వరంగల్ శృంగేరి శారదపీఠం పునర్నిర్మాణం కోసం శిలాన్యాస పూజను శృంగేరి సంప్రదాయ పద్ధతుల్లో శుక్రవారం నిర్వహించినట్లు పీఠం వరంగల్ ప్రధానార్చకుడు సంగమేశ్వర జ్యోషి తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నూతన ఆలయ నిర్మాణ నమూనా చిత్రం ఆకట్టుకుంటుంది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రవీందర్‌రావు, శంకర సేవా సమితి సభ్యులు రామారావు, దేవేందర్, కుమారస్వామి, రవీందర్, వెంకటేశ్వరరావు, భూపాల్, రాజేంద్రప్రసాద్, కల్యాణి, సంధ్యారాణి పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి మహా పుష్పాభిషేకం

కాజీపేట: కాజీపేటలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామివారికి వివిధ రకాల పూలతో అర్చకులు శుక్రవారం మహా పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో పండితులు పుష్పాభిషేకం జరిపించారు. స్వామివారికి నూతన వస్త్రాలతో పాటు బంగారు, వెండి నగలతో అలంకరించారు. వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, దయాకరశర్మ, ఆలయ మేనేజర్ రవి, మణిదీప్ పాల్గొన్నారు.

మేనక జువెల్లరీ అధినేత కుమారుడి వివాహం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రముఖులు

కాజీపేట: మేనక జువెల్లర్స్ అధినేత వాకా సత్యనారాయణ – జయలలిత దంపతుల కుమారుడు అవినాష్ – సువిధరెడ్డి వివాహ వేడుకలు కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని పీజీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. నగర మేయర్ గుండు సుధారాణి, ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ రవితో పాటు పలువురు వ్యాపారవేత్తలు, ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు నివాళి



బార్ అసోసియేషన్ హాల్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు, న్యాయవాదులు



బల్దియా ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు



జానపద గిరిజన విజ్ఞానపీఠంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న పీఠాధిపతి భూక్య బాబురావు, తదితరులు



మడికొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం సభ్యులు, తదితరులు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని నగర వ్యాప్తంగా శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. – సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తంగా

డ్రోన్స్‌తో రైతులకు బహుళ ప్రయోజనాలు

నయీంనగర్: దేశంలో మొట్టమొదటిసారిగా డీజీసీఏ లైసెన్స్ కలిగిన మారుత్ డ్రోన్ వినియోగంతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని మారుత్ డ్రోన్స్ సీఓఓ బాలజీ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు డ్రోన్ ద్వారా ఎకరానికి 8 నిమిషాల్లో పిచికారి చేయవచ్చని అన్నారు. దీనితో రైతులకు సమయంతో పాటు కూలీలకు చెల్లించే డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. వివరాలకు 99120 00365 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రవీణ్, ప్రశాంతి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో చోరీ

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని శివాలయం వీధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగరాజు రవీందర్ ఈనెల 3వ తేదీన బంధువుల శుభకార్యానికి విశాఖ పట్టణానికి వెళ్లాడు. తిరిగి 6వ తేదీన మడికొండ వచ్చి చూడగా తాళం పగులగొట్టి బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడేసి ఉండడాన్ని గమనించాడు. బీరువాలోని రూ.25 వేల నగదుతోపాటు, రూ.35 వేల విలువగల బంగారు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు బాధితుడు రవీందర్ ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

విద్యార్థులకు ఓరియంటేషన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎంకామ్, ఎంబీఏ విద్యార్థులకు శుక్రవారం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అమరవేణి అధ్యక్షతన నిర్వహించిన ఓరియంటేషన్‌లో ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్, సైకాలజిస్టు డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని ఎంపవరింగ్ టుమారో లీడర్స్ – ఏ మోటివేషనల్ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. 21వ శతాబ్దపు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. చదువుతోపాటు నైపుణ్యాలూ ముఖ్యమని గుర్తుచేశారు.

రంగోలమ్మ పాట ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: డబుల్ స్టార్ ఫోక్ సంస్థ ధ్వర్యంలో నిర్మించిన రంగోలమ్మ పాటను బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ శుక్రవారం ఆవిష్కరించారు. రంగోలమ్మ పాట ప్రొడ్యూసర్, డైరెక్టర్ నీరటి పావని, లతను వినయ్‌భాస్కర్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉడుతల సారంగపాణి, సుంచు కృష్ణ, నయీమొద్దీన్, శివకుమార్, దానం, శ్రీధర్, దేవమ్మ, సానియా, తస్లీమా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

వరంగల్: మాజీ మంత్రి హరీష్‌రావు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిల అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ శుక్రవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. ఈక్రమంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులను ఎస్సైలు శ్రీకాంత్, రాజు ముందస్తుగా అరెస్టు చేశారు. స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై సాయంత్రం వదిలిపెట్టారు. అరెస్టు అయిన వారిలో రాజశేఖర్, నేరెళ్ల రాజు, యాదగిరి, రాజపోశాలు, గంధం గోవింద్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి అభినందనలు

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన కేఆర్.దిలీప్‌ను తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కర్ర హరీష్‌రెడ్డి, బొమ్మినేని రాకేష్‌రెడ్డి, ఆవుల పవన్‌కల్యాణ్, కత్తి సుధీర్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రా వెంకటేశంను కలిసిన నాయకులు

ఖిలా వరంగల్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశంను పోపా రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, తదితరులు శుక్రవారం కలిశారు. వెంకటేశంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరామ్ ఆటోమాల్‌పై ఫిర్యాదు

మామునూరు: వేలంపాటలో దక్కిన ట్రాక్టర్‌ను ఇతరులకు విక్రయించిన శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ నిర్వాహకులపై మామునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వర్ధన్నపేటకు చెందిన గద్దం చిన్న తెలిపారు. ఇటీవల ఆరు కార్లు, మూడు ట్రాక్టర్లను వేలం పాటలో దక్కించుకున్నానని, ఈక్రమంలో ఆ వాహనాలకు డబ్బులు చెల్లించి తీసుకునేందుకు పున్నేలు క్రాస్‌రోడ్డు శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ బ్రాంచ్‌కు శుక్రవారం వెళ్లగా ట్రాక్టర్ కనిపించలేదని బాధితుడు తెలిపారు.

అడ్తి వ్యాపారి మృతి

వరంగల్: అనారోగ్య సమస్యలతో అడ్తి వ్యాపారి తుమికి సురేష్‌బాబు (59) శుక్రవారం మృతి చెందారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సాయి ఆదిలక్ష్మి ట్రేడర్స్ పేరుతో వ్యాపారం చేస్తున్న సురేష్‌బాబు.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంపై వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిదులతో పాటు పలువురి వ్యాపారులు సంతాపం తెలిపారు.

జాబితా నుంచి అనర్హులను తొలగించాలి

కాజీపేట అర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా నుంచి అనర్హులను తొలగించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట నాయబ్ తహసీల్దార్ ప్రణయ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.